క్లుప్తంగా

సబ్‌జైల్‌ను తనిఖీ చేసిన జిల్లా జడ్జి



సబ్ జైల్‌లో స్టోర్‌రూమ్‌ను పరిశీలిస్తున్న జిల్లా జడ్జి బబిత

చీపురుపల్లి: పట్టణంలోని సబ్ జైల్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. బుధవారం సాయంత్రం స్థానిక సబ్ జైల్‌కు వచ్చిన ఆమె కారాగారంలో ఉన్న ఖైదీలతో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు చట్టాలపై ఖైదీలకు అవగాహన కల్పించారు. సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు ఖైదీల పట్ల ఎలాంటి వివక్ష చూపించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే సబ్‌జైల్‌లో కొనసాగుతున్న జైల్ లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను పర్యవేక్షించారు. అనంతరం ఖైదీలతో మాట్లాడుతూ.. నేర ప్రవృత్తిని విడనాడి మంచి పౌరులుగా సమాజంలో మెలగాలని సూచించారు. అంతకుముందు గరివిడిలో చెవిటి, మూగ పాఠశాలను సందర్శించి అక్కడి వసతులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సుధాకర్ పట్నాయక్

మెరకముడిదాం: సిబ్బంది సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సుధాకర్ పట్నాయక్ అన్నారు. మండలంలోని సోమలింగాపురం సచివాలయాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరించాలన్నారు.

దేవీ నవరాత్రులకు పందిరిరాట



పందిరిరాట వేస్తున్న యూత్ సభ్యులు

వేపాడ: మండలంలో వల్లంపూడిలో దేవీ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని బుధవారం పందిర్రాట వేశారు. వల్లంపూడి చిన్నవీధి యువసేన ఆధ్వర్యంలో వల్లంపూడి, వేపాడ గ్రామపెద్దలు, భక్తుల సహకారంతో ఈ నెల 22 నుంచి అక్టోబర్ 2 వరకు ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా అన్ని ఏర్పాట్లు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

బకాయిలు విడుదల చేయండి

- ఆపస్ డిమాండ్



మాట్లాడుతున్న ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ

గజపతినగరం రూరల్: ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు రావాల్సిన సుమారు రూ.30 వేల కోట్ల ఆర్థిక బకాయిల విడుదలకు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు శవన్నగారి బాలాజీ డిమాండ్ చేశారు. సభ్యత్వ అభియాన్‌లో భాగంగా మండలంలోని పలు పాఠశాలలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా జిన్నాం ఉన్నత పాఠశాలలో ఆయన మాట్లాడుతూ.. అర్హత గల ఉపాధ్యాయులకు జూనియర్ కళాశాలల్లో లెక్చరర్లుగా నియమించాలన్నారు. ఆపస్ రాష్ట్ర కార్యదర్శి రామానాయుడు మాట్లాడుతూ.. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు ఎటువంటి షరతుల్లేకుండా వైద్యసేవలు అందించాలన్నారు.కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కొవ్వాడ శ్రీనివాసరావు, బల్ల శ్రీనివాసరావు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

భూ దోపిడీ ఆపండి..



బొడ్డవరలో ఆందోళన చేస్తున్న నిర్వాసితులు

శృంగవరపుకోట: కంపెనీల పేరుతో జిందాల్ చేస్తున్న భూ దోపిడీని ఆపాలని నిర్వాసిత రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బొడ్డవర వద్ద జిందాల్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తీసుకున్న భూములను వెంటనే వెనక్కి ఇవ్వాలని కోరారు.

యూరియాపై నిలదీత..

- ప్రభుత్వం తీరుపై మండిపడిన సభ్యులు
- వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం



సర్వసభ్య సమావేశంలో యూరియా కోసం సభ్యుల మధ్య వాగ్వాదం

శృంగవరపుకోట: ‘యూరియా వాడొద్దు.. క్యాన్సర్ వస్తుందన్న ముఖ్యమంత్రి చంద్రబాబు మరి మందు మానేయండి రోగం వస్తుందని చెప్పొచ్చు కదా’ అని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ప్రశ్నించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ ఎస్.సోమేశ్వరరావు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు యూరియా పంపిణీ చేయకపోవడంపై నిలదీశారు. ప్రైవేట్ డీలర్ల వద్ద లభ్యమవుతున్న యూరియా ఆర్‌ఎస్‌కేల వద్ద ఎందుకే లేదని ప్రశ్నించారు. ప్రైవేట్ డీలర్లను పెంచి పోషించేందుకు కూటమి ప్రభుత్వం ఆడుతున్న కుట్ర ఇదంతా అని సర్పంచ్‌లు కె. వెంకటరావు, ఎం.యామిని, డి.సంతోషికుమారి, జుత్తాడ సూర్యారావు, వైస్ ఎంపీపీ పినిశెట్టి వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యులు పదాల ధర్మారావు, గుమ్మడి సన్యాసప్పడు ఆరోపించారు. ఈ సమయంలో టీడీపీ ఎంపీటీసీ సభ్యుడు ఆర్.చంద్రశేఖర్ కలుగజేసుకుని రైతులకు కావాల్సినంత యూరియా పంపిణీ చేశామని చెప్పడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. గ్రామాల్లోకి వస్తే రైతులు ఎంత ఇబ్బంది పడుతున్నారో తెలుస్తుందని పలువురు సభ్యులు అన్నారు.

ఈ విషయమై ఏఓ రవీంద్ర వివరణ ఇస్తూ ప్రస్తుతం యూరియా ఉందని, మరో 100 టన్నుల యూరియా త్వరలో వస్తుందని చెప్పారు. జిందాల్ కంపెనీ ఎంఎస్‌ఎంఈ పార్కుల ఏర్పాటుకు సంబంధించి గ్రామసభలు ఏర్పాటు చేసి ప్రజాభిప్రాయం తెలుసుకోవాలని నాలుగు పంచాయతీల తరఫున ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. పోతనాపల్లి రక్షిత మంచినీటి పథకం పాడవ్వడంతో ఆరునెలలుగా తాగునీటి సరఫరా నిలిచిపోయిందని.. మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని కోరినా ఫలితం లేకపోయిందని పోతనాపల్లి సర్పంచ్ కె. వెంకటరావు అన్నారు. చామలాపల్లి గ్రామదేవతకు కేటాయించిన మూడెకరాల భూమి అన్యాక్రాంతం అవుతోందని చామలాపల్లి సర్పంచ్ జె.సూర్యారావు సభ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం సభ్యులు పలు సమస్యలు ప్రస్తావించగా.. అధికారులు సమాధానాలిచ్చారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు సత్యకిశోర్, శ్రీనివాస్, ప్రసాద్, కే.దేవి, కె.స్వామి, ప్రజాప్రతినిధులు వాకాడ సింహాచలం, బషీర్, తదితరులు పాల్గొన్నారు.

యూరియా కొరతపై ధ్వజం..



సమస్యలు వివరిస్తున్న మండల సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు నిరుజోగి వెంకటరావు

- 14 నెలలుగా పంచాయతీ సమావేశం నిర్వహించలేదు: బానాది సర్పంచ్ కర్రి యశోద

వేపాడ: ఖరీఫ్ సీజన్ పూర్తవుతున్నా యూరియా అవసరం మేరకు పంపిణీ చేయకపోవడంపై సభ్యులు వ్యవసాయ శాఖాధికారులపై ధ్వజమెత్తారు. మండల పరిషత్ అధ్యక్షుడు దొగ్గ సత్యవంతుడు అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్సీ ఇందుకూరు రఘురాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బానాది సర్పంచ్ కర్రి యశోద మాట్లాడుతూ.. 14 నెలలుగా పంచాయతీ సమావేశం నిర్వహించ లేదని సభ దృష్టికి తీసుకువచ్చారు. 90 రోజుల్లో నిర్వహించాల్సిన మీటింగ్ 14 నెలలుగా ఎందుకు నిర్వహించలేదని అధికారులను ప్రశ్నించారు. మండల సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు నిరుజోగి వెంకటరావు కలుగజేసుకుని.. పంచాయతీ కార్యదర్శి వచ్చి సమాధానం చెప్పకపోతే తామంతా వాకౌట్ చేస్తామన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి బాధ్యులపై చర్యలు తీసుకునేలా ప్రయత్నిస్తానని ఎమ్మెల్సీ రఘురాజు అన్నారు. దీంతోఈఓపీఆర్‌డీ రవికుమార్ బానాది పంచాయతీ కార్యదర్శి నారాయణమూర్తిని సమావేశానికి రప్పించి, ఎందుకు సమావేశం నిర్వహించలేదని ప్రశ్నించారు. అయితే అతను సరైన సమాధానం చెప్పకపోవడంతో అధికారులు మండిపడ్డారు.త్వరలోనే సమావేశం ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటానని అధికారులు చెప్పడంతో సభ్యులు శాంతించారు. అనంతరం తల్లికివందనం, యూరియా పంపిణీపై వాడీవేడిగా సమావేశం సాగింది. బల్లంకి సర్పంచ్ కనకరాజు మాట్లాడుతూ.. తల్లికివందనం డబ్బులు ఒక్కొక్కరికి ఒక్కోలా పడ్డాయన్నారు. అలాగే మరి కొంతమంది సభ్యులు మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్ ముగిసిన తర్వాత యూరియా ఇస్తారా అని ప్రశ్నించారు. సమయం అయిపోయిన తర్వాత యూరియా ఇస్తే ఎవరికి లాభమని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మాట్లాడుతూ.. రహదారి ఏర్పాటు కోసం మారిక గిరిజనుల నుంచి భూములు తీసుకోవడం సరికాదన్నారు.కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ చినరామునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణ చేయాలనుకోవడం దారుణం

- చంద్రబాబు పాలనలో ఒక్క మెడికల కళాశాలైనా ఏర్పాటు చేశారా..?
- మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



చలో మెడికల్ కాలేజీ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కడుబండి, తదితరులు

కొత్తవలస: ప్రతిభ గల పేద విద్యార్థులకు వైద్య విద్యను అందించేందుకు మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి తన హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా 17 మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేస్తే.. వాటిని ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రైవేటీకరణ చేయాలనుకోవడం దారుణమని మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు మండిపడ్డారు. చంద్రబాబు తన హయాంలో ఒక్క మెడికల్ కళాశాలైనా ఏర్పాటు చేశారా అని ప్రశ్నించారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు నిరసనగా ఈ నెల 19న జిల్లా కేంద్రంలో గల జేఎన్‌టీయూ జంక్షన్ నుంచి నిరసన ర్యాలీ చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ మేరకు మండలంలోని అర్ధన్నపాలెం గ్రామ సమీపంలో గల ఆయన క్యాంప్ కార్యాలయం వద్ద ఐదు మండలాల వైఎస్సార్‌సీపీ మండల యువజన పార్టీ అధ్యక్షులతో కలిసి చలో మెడికల్ కళాశాల పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం రాష్ట్రంలో కనికట్టు పాలన సాగుతోందని విమర్శించారు. అన్నివిధాలా రాష్ట్ర ప్రజలను కూటమి నేతలు మోసం చేశారని ఆరోపించారు. చంద్రబాబు పాలనలో పేదవాడి బతుకుకు భరోసా ఉండదని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను ఆపాలని, లేని పక్షంలో తీవ్ర పరిణామాలు చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో వేపాడ, ఎల్.కోట, కొత్తవలస, జామి, ఎస్.కోట మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభినందనలు



రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం, తదితరులు

చీపురుపల్లి రూరల్ (గరివిడి): గరివిడిలో గల శ్రీరామ్‌నగర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల నెల్లిమర్ల మండలంలోని కొండవెలగాడ పాఠశాలలో నిర్వహించిన కుస్తీ పోటీల్లో శ్రీరామ్‌నగర్ పాఠశాల విద్యార్థులు 16 మంది ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. దీంతో రాళ్ల అన్షిక్, ఎస్.లక్ష్మి, తదితరులను హెచ్‌ఎం ఎం. నిర్మల, పీఈటీ ఎం. ఉదయ్‌కుమార్, తదితరులు బుధవారం ప్రత్యేకంగా అభినందించారు.

చిన్నారులకు సన్మానం

చీపురుపల్లిరూరల్ (గరివిడి): ఓ వృద్ధుడిని విష సర్పం నుంచి సమయస్ఫూర్తితో కాపాడిన ఇద్దరు చిన్నారులను కోడూరు ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం సన్మానించారు. ఇటీవల పాఠశాలకు చెందిన ఐదో తరగతి విద్యార్థినులు జి.దేదీప్య, జి.చరిష్మా ఇంటికి వెళ్తున్న సమయంలో కంటిచూపు లేని ఓ వృద్ధుడి ముందు విషసర్పం ఉండటాన్ని గమనించి, వృద్ధుడ్ని పక్కకు తప్పించారు. దీంతో పిల్లల సాహసాన్ని మెచ్చుకుని సన్మానించారు. కార్యక్రమంలో మానవీయతా సంస్థ వ్యవస్థాపకుడు బీవీ గోవిందరాజులు, మండల విద్యాశాఖాధికారి పి.రామారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామ కమిటీలదే కీలకపాత్ర

- వైఎస్సార్‌సీపీ నాయకులు



పత్తికాయవలసలో ఏర్పాటు చేసిన గ్రామ కమిటీతో వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లి: వైఎస్సార్‌సీపీలో గ్రామ, బూత్ కమిటీలు కీలకపాత్ర పోషించనున్నాయని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇప్పిలి అనంతం, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాస నాయుడు, మండల అధ్యక్షుడు మీసాల వరహాలనాయుడు అన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గ్రామ, బూత్ కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగానే మండలంలోని దేవరపొదిలాం, నిమ్మలవలస, పత్తికాయవలస పంచాయతీల్లో బుధవారం గ్రామ కమిటీలు ఏర్పాటు చేశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వారు కూటమి వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అధికార్ల శ్రీనుబాబు, దన్నాన జనార్దనరావు, చింతాడ లక్ష్మణరావు, చింతాడ చంద్రరావు, బొల్లు గురునాయుడు, పెద్ది గోవింద, తమ్మిన కృష్ణారావు, ప్రభాత్, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రం

చీపురుపల్లి: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని స్వచ్ఛభారత్ మండల కో ఆర్డినేటర్ మీసాల లక్ష్మణరావు సూచించారు. పట్టణంలోని శ్రీనివాసా జూనియర్ కళాశాలలో స్వచ్ఛ భారత్‌పై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంటే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఏడీఎన్‌ఎస్‌వీ ప్రసాద్, ఎన్‌ఎస్‌ఎస్ పీఓలు మీసాల వెంకటరమణ, రౌతు కృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

యువతే దేశానికి వెన్నెముక

గజపతినగరం రూరల్: యువత దేశానికి వెన్నెముక లాంటి వారని.. అటువంటి యువత మత్తు పదార్థాల జోలికి పోకుండా.. ఒక లక్ష్యం ప్రకారం పయనించాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రావాడ సత్యనారాయణ పిలుపునిచ్చారు. నషా ముక్త్‌భారత్ అభియాన్‌లో భాగంగా బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో బుధవారం స్థానిక డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సిస్టర్ హేమలత, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయండి



నియామక పత్రాలను అందజేస్తున్న బూత్ ఇన్‌చార్జ్ చందు

బొండపల్లి: వైఎస్సార్‌సీపీ గ్రామ, బూత్ కమిటీ నాయకులు పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలని పార్టీ బూత్ ఇన్‌చార్జ్ తాడ్డి చందు పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ఆదేశాల మేరకు బొండపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు, వివిధ విభాగాల సభ్యులను బుధవారం ఎన్నుకుని వారికి నియామకపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా చందు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బండారు బంగారం, వైస్ ఎంపీపీ గొండేల ఈశ్వరరావు, సర్పంచ్ బొండపల్లి ఈశ్వరరావు, ఉప సర్పంచ్ కోళ్ల వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యుడు బండారు శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి



చీపురుపల్లి: విశ్వకర్మ విగ్రహాన్ని ఊరేగిస్తున్న సంఘ ప్రతినిధులు

చీపురుపల్లి/కొత్తవలస/గజపతినగరం: మది వ్రాట్ విశ్వకర్మ జయంతి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. చీపురుపల్లి మండల విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని హడ్కో కాలనీలో గల పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో బుధవారం ఉత్సవాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా విశ్వకర్మ విగ్రహాన్ని ఊరేగించారు. కొత్తవలస రైల్వేస్టేషన్ ఆవరణలో.. గజపతినగరం మండలం పురిటిపెంటలో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.



కొత్తవలస: రైల్వేస్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విశ్వకర్మ విగ్రహం

ఆటోల బంద్ విజయవంతం



చీపురుపల్లి: మూడు రోడ్ల జంక్షన్‌లో బైఠాయించి నినాదాలు చేస్తున్న ఆటో డ్రైవర్లు



గజపతినగరం రూరల్: మాట్లాడుతున్న యూనియన్ సభ్యులు పురం అప్పారావు, తదితరులు



జామి: భీమసింగి జంక్షన్‌లో ధర్నా నిర్వహిస్తున్న ఆటో కార్మికులు

చీపురుపల్లి: కూటమి ప్రభుత్వం వచ్చి ఆటో డ్రైవర్ల పొట్ట కొట్టింది.. ఇప్పటికే కేసులు, చాలానాల పేరిట డ్రైవర్లను దోచుకుంటున్న ప్రభుత్వం తాజాగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించి డ్రైవర్ల నడ్డి విరిచింది. ప్రభుత్వం తీరును నిరసిస్తూ ఆటో డ్రైవర్ల జిల్లా యూనియన్ పిలుపు మేరకు చీపురుపల్లి నియోజకవర్గంలోని చీపురుపల్లి, గరివిడి, గుర్ల, మెరకముడిదాం మండలాలకు చెందిన ఆటో డ్రైవర్లు బుధవారం బంద్ పాటించారు. దీంతో నియోజకవర్గంలో ఒక్క ఆటో కూడా తిరగకుండా వందలాది సంఖ్యలో ఆటో డ్రైవర్లు నియోజవకర్గ కేంద్రమైన చీపురుపల్లి చేరుకున్నారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ, సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేసుకుంటూ పట్టణంలో మెయిన్‌రోడ్, లావేరురోడ్, గాంధీబొమ్మ జంక్షన్, తదితర ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక మూడు రోడ్ల జంక్షన్‌లో బైఠాయించి నిరసన తెలిపారు. బంద్‌కు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇప్పిలి అనంతం, సిఐటీయూ డివిజన్ కార్యదర్శి అంబల్ల గౌరునాయుడు మద్దతు ప్రకటించారు.

రూ.25 వేలు ఇవ్వాలి

గజపతినగరం రూరల్: ఆటో కార్మికులకు కూటమి ప్రభుత్వం ఎటువంటి షరతులు లేకుండా ఒక్కొక్కరికీ రూ.25 వేలు చొప్పున వాహనమిత్ర పథకం కింద ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పురం అప్పారావు డిమాండ్ చేశారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలి వద్ద ఆటో డ్రైవర్లతో కలిసి మానవహారంగా ఏర్పడి, ఎన్టీఆర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులను ఇబ్బంది పెట్టే జీఓ 21,31లను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు ఈశ్వరరావు, సూర్యనారాయణ, కేశవ, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు

సమస్యలు పరిష్కరించాలి...

జామి: తమ న్యాయపరమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ భీమసింగి జంక్షన్‌లో దేవీ ఎల్లమాంబ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో పలువురు డ్రైవర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉచిత ప్రయాణ పథకం వల్ల తామంతా రోడ్డున పడ్డామన్నారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు ఎం.అప్పలరాజు, సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

‘కోట’లో రణభేరి



ఎస్.కోట: నినాదాలు చేస్తున్న ఉపాధ్యాయులు

శృంగవరపుకోట: పట్టణంలోని దేవీ జంక్షన్ వద్ద యూటీఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం రణభేరి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు రెడ్డి మోహనరావు, కిషోర్‌కుమార్, మురళీమోహన్, విజయగౌరి మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి విముక్తి కల్పించాలన్నారు. 12వ పీఆర్‌సీ అమలు చేయడంతో పాటు నాలుగు డీఏలు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, జేవీఆర్‌కే ఈశ్వరరావు, జె.రమేష్, డి.రాము, సీహెచ్ భాస్కరరావు, జిల్లా కార్యదర్శి జీవీ రమణ, జి.వెంకటరావు, మండల కార్యవర్గ సభ్యులు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బోధనకే పరిమితం చేయాలి..

గజపతినగరం రూరల్: ప్రభుత్వ ఉపాధ్యాయులకు బోధనేతర పనులు రద్దు చేసి కేవలం బోధనకే పరిమితం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహనరావు డిమాండ్ చేశారు. మండలంలోని మరుపల్లి ఆదర్శ పాఠశాల వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జిల్లాలోని బొబ్బిలిలో రణభేరి కార్యక్రమం ప్రారంభించి మరుపల్లి చేరుకున్నామన్నారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించని ఎడల ఈ నెల 25న గుంటూరులో భారీ బహిరంగ సభ నిర్వహించి కూటమి ప్రభుత్వానికి గట్టి మెచ్చరికలు పంపిస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు కిషోర్‌కుమార్, మురళీమోహన్, జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఈశ్వరరావు, సీనియర్ సభ్యులు రమేష్ పట్నాయక్, రాము, జిల్లా కోశాధికారి చింత భాస్కరరావు, అల్లు శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యం మేలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సునీత

బొండపల్లి: ప్రకృతిలో లభించే ఔషధ గుణాలు కలిగిన మొక్కలు, చెట్లతో తయారయ్యే ఆయుర్వేద వైద్యం పశువులకు ఎంతో మేలు చేస్తుందని గొట్లాం ఆయర్వేద ఆస్పత్రి డాక్టర్ బి.సునీత తెలిపారు. పదో జాతీయ ఆయుర్వేద దినోత్సవం బుధవారం నిర్వమించారు. ఈ సందర్భంగా పశువులు ఆరోగ్యం ఉండాలంటే ప్రకృతిలో లభించే ఆహార వివరాలు తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది,గ్రామస్తులు పాల్గొన్నారు.



గుర్ల: వల్లాపురం సచివాలయం ముందు రైతుల నిరసన



గుర్ల: మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ దుకాణం వద్ద క్యూలైన్‌లో నిల్చొన్న రైతులు

యూరియా కోసం తప్పని నిరీక్షణ

ఖరీఫ్ సీజన్‌లో ఈ సమయానికే వరి పైరుకు యూరియా వేయాల్సి ఉండగా.. ఇంతవరకు ఒక్క గుళిక కూడా వేయలేకపోవడంతో పంట తెగుళ్ల బారిన పడి పాడవుతోంది. అధికారులేమో యూరియా వచ్చేస్తోంది.. రేపు ఇస్తాం.. ఎల్లుండి ఇస్తాం అంటూ ప్రకటనలు గుప్పిస్తుండడంతో అన్నదాతలు ఆర్‌ఎస్‌కేల వద్దకు, ప్రైవేట్ డీలర్ల షాపుల వద్దకు పరుగులు తీస్తున్నారు. గంటల తరబడి నిల్చున్నా ఒక్క బస్తా కూడా దొరకని పరిస్థితి. దీంతో అన్నదాతలు మండిపడుతున్నారు. అధికార పార్టీ అండదండలున్న వారికి మాత్రం రాత్రిపూట ఎరువులు వెళ్లిపోతున్నాయన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఎప్పుడైనా లేనంతగా ఈ ఏడాదే ఎందుకీ పరిస్థితి వచ్చిందని రైతులు ఊసూరోమంటున్నారు.

– గంట్యాడ/గుర్ల



గంట్యాడ: బుడతానపల్లి ఆర్‌ఎస్‌కే వద్ద యూరియా కోసం నిరీక్షిస్తున్న రైతులు